క్లుప్తంగా

మొక్కలు సిద్ధం చేయాలి



పాన్‌గల్: గ్రామాలకు హరితహారంలో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండలంలోని తెల్లరాళ్లపల్లి తండాను సందర్శించి నర్సరీని, నూతన పంచాయతీ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండటంతో పారిశుద్ధ్య పనుల్లో ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతమ్మ, కార్యదర్శి నర్మద, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

డీఎస్పీ రవీందర్‌రెడ్డికి సన్మానం



అమరచింత: పట్టణానికి చెందిన రవీందర్‌రెడ్డి డీఎస్పీగా పదోన్నతి పొంది స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణవాసులకు తన వంతు సాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహంకాళీ విష్ణు, జుబేర్‌అహ్మద్, వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ్, జాన్, మన్నాన్, అయ్యూబ్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



పాన్‌గల్: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని అన్నారం ప్రాథమిక పాఠశాలను ప్రార్థన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు, సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు పఠనాసక్తి పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాధ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



గోపాల్‌పేట: మండలంలో ఉన్న క్షయ వ్యాధిగ్రస్తులకు మంత్రి నిరంజన్‌రెడ్డి ట్రస్టు ద్వారా వచ్చిన న్యూట్రీషన్స్‌ను పంపిణీ చేసినట్లు డాక్టర్ కెల్విన్ మార్క్ తెలిపారు. గురువారం ఆయన మంత్రి ట్రస్టు ద్వారా వచ్చిన బియ్యం, కందిపప్పు, మంచినూనె, కోడిగుడ్లను వ్యాధిగ్రస్తులకు అందించారు. వైద్య సిబ్బంది సుచిత్ర, కౌసల్య, కవిత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి



వనపర్తి టౌన్: పట్టణంలో రోడ్ల విస్తరణలో భాగంగా మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలను పక్కకు జరిపినట్లుగా, దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఇప్పుడున్న స్థలం నుంచి పక్కకు జరుపుతారనే ప్రచార నేపథ్యంలో గురువారం కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ విగ్రహం దిమ్మె చుట్టూ ఉన్న పోస్టర్లను తొలగించి, శుభ్రం చేశారు. అనంతరం రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, మైనార్టీ అధ్యక్షుడు సమద్, మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండీ బాబా, నాయకులు నాగరాజు, అబ్దుల్లా, రాంరెడ్డి, ద్యారపోగు విజయ్ బాబు, నరేందర్‌రెడ్డి, బెక్కరి వెంకటేష్, పాతకోట రవి, తిరుపతయ్య, ఎండీ పాషా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

వనపర్తి టౌన్: చదువుతోనే బంగారు భవిష్యత్ లభిస్తుందని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి అభ్యున్నతిలోకి రావాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీడ్ (పఠనం) కార్యక్రమాన్ని చేపట్టిందని గెజిటెడ్ ప్రధాన ఉపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. దళితవాడ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని 16 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఇద్దరు చొప్పున విద్యార్థులతో గురువారం దళితవాడ పాఠశాలలో రీడ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడం ద్వారా ప్రాథమిక స్థాయి నుంచే నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. పఠనంతో విద్యార్థులు పాఠ్యాంశాలపై ఆసక్తి పెరుగుతుందని, తద్వారా అక్షర దోషాలు పోకుండా రీడింగ్ ప్రాముఖ్యతను గుర్తించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయులు ఎక్కడికక్కడ విద్యార్థుల సామర్థ్యాల పెంపుపై, పఠనాసక్తిపై వినూత్న కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. చదవడంతో మానసిక పరిపక్వత ఏర్పడటమే కాకుండా పరిపూర్ణమైన అభిప్రాయాన్ని విద్యార్థులు కలిగి ఉంటారని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు ఆంగ్ల భాషపై అవగాహన పెంచేలా ఉపాధ్యాయులు తగిన రీతిలో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం తెలుగు, ఇంగ్లిష్ పాఠ్యాంశాలను పఠించడంలో అద్భుత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. రీడ్ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా ఆర్. శ్రీనివాసులు, అంజనమ్మ, రాధిక, కృష్ణవేణి వ్యవహరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రీడ్ ప్రోగ్రామ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న అధికారులు

అందరి సహకారంతోనే పట్టణ అభివృద్ధి

ఆత్మకూర్: ప్రజల సహకారంతోనే మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా చేపడుతున్నామని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం పురపాలిక కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. హరితహారంలో భాగంగా పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మున్సిపాలిటీ ఆవరణలో రూ.50లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పార్కు పనులను చేపడుతున్నామన్నారు. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణంలో ఇదివరకే రూ.15కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. ఇక్కడి పార్కులో 16 రకాల పూలమొక్కలతో పాటు ఇతర 40 రకాల మొక్కలు నాటడంతో పాటు వాకింగ్‌ట్రాక్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. స్థానికులు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గాయత్రి

కాంగ్రెస్‌తోనే సంక్షేమ ఫలాలు



అమరచింతలో ప్రచారం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్: కాంగ్రెస్‌తోనే పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని ఎంపీపీ మేఘారెడ్డి అన్నారు. కొల్లాపూర్‌లో ఈనెల 20న నిర్వహించనున్న కాంగ్రెస్ భారీ బహిరంగ సమావేశంలో ఆ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించిన ఆయన గురువారం మాజీ మంత్రి చిన్నారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ చేరుతున్నానని, పార్టీ నిర్దేశించిన విధంగా ముందుకు సాగుతామని, అందుకు మద్దతుగా ఉండాలని మాజీ మంత్రి చిన్నారెడ్డిని మేఘారెడ్డి కోరారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ అందరి లక్ష్యం ఒక్కటైనప్పుడు విజయాన్ని చేరుకుంటామన్నారు. అనంతరం నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, రాజీవ్‌గాంధీ విగ్రహం పక్కకు జరిపేందుకు అధికార పార్టీ చేస్తున్న ప్రయత్నాలు, పట్టణంలో జరుగుతున్న రోడ్ల విస్తరణ, ఇతర అంశాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.

అమరచింత: కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ద్వారానే ప్రజలకు సుపరిపాలన అందించే వీలుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రామ్‌సింగ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను నియోజకవర్గంలో ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. గరీబీ హఠావో అన్న నినాదంతో దేశంలోని బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతులకు ఏకకాలంలో పంట రుణాలను రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, తులసీరాజ్, తౌఫిక్, పోసిరిగారి విష్ణు, శ్యాంప్రకాష్ ఉన్నారు.



వనపర్తిలో చిన్నారెడ్డిని కలిసిన మేఘారెడ్డి

ఉప సర్పంచ్‌ను వేధించడం సరికాదు: బీజేపీ



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురం ఉప సర్పంచ్ రాంరెడ్డికి మండల పరిషత్, జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో బీజేపీ నాయకులు నోటికి నల్ల బట్టలు కట్టుకుని మౌన దీక్ష చేశారు. అనంతరం ఎంపీడీఓ విజయ్‌కుమార్‌తో పాటు జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు, సోళీపురం ఉప సర్పంచ్ మాట్లాడుతూ సర్పంచులు ఎన్నికై ఐదేళ్లు పూర్తి కావస్తున్నప్పటికీ ఉప సర్పంచు గెలుపొందిన వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం లేదని అసహనం వ్యక్తంచేశారు. ప్రతిపక్ష పార్టీ వ్యక్తులు సభ్యులుగా ఉన్న వార్డులో అధికార పార్టీలో ఉన్న సర్పంచ్ కక్ష సాధింపు చర్యలు తీసుకుంటున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని తీర్మానం చేసిన మురుగు కాల్వ పనులు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఆశన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి, ప్రధాన కార్యదర్శులు అంజనేయులు, శివశంకర్, ఉపాధ్యక్షులు సత్యం, రాంచందర్, భద్రయ్య, కొండల్, మన్నెం తదితరులు పాల్గొన్నారు.

రథయాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరణ

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీఎస్ సీపీఎస్‌ఈయూ సంఘం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయపరంగా రావాల్సిన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడంతో పాటు సీపీఎస్ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ నెల 16 నుంచి పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ ఆలయం నుంచి ప్రారంభం అవుతుందని, యాత్రకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మద్దిలేటి, రాష్ట్ర సెక్రెటరీ వడ్డె మోహన్‌బాబు, కేతావత్ దశరథ్‌నాయక్, గంధం రంగస్వామి, అనిల్ గౌతమ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

యువతి అదృశ్యం

వనపర్తి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ రోడ్డులోని హాస్టల్‌లో ఉంటూ పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీకాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్న తన కుమార్తె మమత నాలుగు రోజులుగా కనిపించటం లేదని గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆమె తండ్రి నరేంద్ర ఫిర్యాదు చేశారు. పాన్‌గల్ మండలంలోని బుసిరెడ్డిపల్లికి చెందిన మమత ఈనెల 9వ తేదీన అనారోగ్యంగా ఉంది ఇంటికి వెళ్తున్నానని వార్డెన్ చెప్పిందని, కానీ నేటికీ తను ఇంటికి రాకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీ

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కొత్తకోట బైపాస్ 44వ జాతీయ రహదారిపై ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొట్టుకోవడంతో బొచ్చు చిన్నా కు తీవ్ర గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బొచ్చు చిన్న హైదరాబాద్ నుంచి గద్వాలకు బుల్లెట్ బైకుపై వెళ్తుండగా పెబ్బేరు సమీపంలో ఆనంద్ భవన్ ఉడిపి హోటల్ వద్ద 44వ జాతీయ రహదారిపై రాంపూర్ గ్రామానికి చెందిన డ్రైవర్ చాకలి రాఘవేందర్ నడుపుతున్న ఇసుక ట్రాక్టర్ అతివేగంగా రోడ్డు దాటుతున్న క్రమంలో బుల్లెట్ బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న బొచ్చు చిన్న కు తీవ్ర గాయాలు కావడంతో పాటు ఎడమ కాలు పూర్తిగా తెగిపోయింది. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు గతంలో మాజీ మంత్రి డీకే అరుణ కుమార్తె కారు డ్రైవర్‌గా పనిచేసినట్లు తెలిసింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరికలు



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

చిన్నంబావి: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై మండలంలోని మియాపూర్‌కు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు కొల్లాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కలిసికట్టుగా పార్టీ కోసం కృషి చేసి గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని, భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మరింత ముందుకు తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో చిన్నారెడ్డి, డేగ శేఖర్, కృష్ణయ్య, కిరణ్‌కుమార్ గౌడ్, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాలను ఫ్రీజ్ చేయొద్దు



అమరచింత యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆయూబ్‌ఖాన్



శ్రీరంగాపురం ఎస్‌బీఐ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆత్మకూర్: బ్యాంకుల్లో రైతుల ఖాతాలను బ్లాక్ లిస్టు నుంచి తొలగించి రైతుబంధు, ధాన్యం డబ్బులను వెంటనే ఇవ్వాలని కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వినయ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీను అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేసి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకు అధికారులు రైతుల అకౌంట్లను సీజ్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం డబ్బులు, రైతుబంధు డబ్బులు ఇవ్వకుండా వేధించడం సరికాదన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, రైతులకు ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేసి ఆదుకుంటామని, అంతవరకు రైతులకు బ్యాంకు అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో లోకారెడ్డి, ప్రహ్లాద్, భగవంతు, రైతులు ఉన్నారు.

అమరచింత: రైతుబంధు డబ్బులతో పాటు పంట అమ్మడం ద్వారా వచ్చిన డబ్బులను నేరుగా రైతులకు బ్యాంక్ ద్వారా తీసుకోనే సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ యూనియన్ బ్యాంక్ మేనేజర్ శివశంకర్‌కు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈమేరకు డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు బ్యాంకు ఎదుట రైతు సమస్యలపై గురువారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రామ్‌సింగ్ నాయక్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, తులసీరాజ్, తౌఫిక్, విష్ణు, శ్యామ్, ప్రకాశం, హన్మంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు అధికారులు రైతులకు ఇబ్బంది కలిగించే విధంగా అకౌంట్లను లాక్ చేసి ఉంచడాన్ని నిరసిస్తూ గురువారం కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలోని బ్యాంకు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రైతుబంధు డబ్బులు తీసుకునేందుకు వెళ్లిన పలువురు రైతుల ఖాతాలు ఫ్రీజ్‌లో ఉంచడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నక్క విష్ణు, ఆంజనేయులు, సాయిబాబు, కర్ణిక ఈశ్వర్ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: రైతుల బ్యాంక్ ఖాతాలను హోల్డ్ చేయకుండా చూడాలని గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో శ్రీరంగాపురం మండల కేంద్రలోని ఎస్‌బీఐ ఎదుట మండల అధ్యక్షుడు రాములు యాదవ్ రైతులతో కలిసి ధర్నా చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాములు, ఎంపీటీసీ ఎల్లస్వామి, నాయకులు గోవిందు, విష్ణు, చందు, భాస్కర్, రామరాజు, భాస్కర్, తోట రవి తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం గ్రామానికి చెందిన మన్యం గడ్డివాములకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. గురువారం అటుగా వెళ్తున్న రైతులు బాధితుడికి సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న రైతు పూర్తిగా దగ్ధమయిన గడ్డి వాములను చూసి వాపోయారు. సుమారు రూ.10వేల ఆస్తి నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన వాలీబాల్ క్రీడాకారుడు బుడ్డ ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందడటంతో గురువారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతురెడ్డి, డబ్బా వెంకటయ్య, ఎర్ర కుర్మయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాన్‌గల్: పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని బీఎస్పీ జిల్లా కోశాధికారి వెంకటేష్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు గురువారం వారు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం 8 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం వంటివి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాము, సుబ్బయ్య, శివ, పెంటయ్య, నాగన్న, చంద్రశేఖర్, బీఎస్పీ నాయకులు గోపాల్, ప్రకాష్, పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: న్యాయమైన పంచాయతీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చకుంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీఎస్పీ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన దీక్షలో బీఎస్పీ నాయకులు పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

రైతులను మోసం చేసేందుకు కుట్ర



ఆత్మకూర్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



రేవల్లి మండల కేంద్రంలో..

ఆత్మకూర్: ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి, దహనం చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ బంగారుశ్రీను, మాజీఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండోఅధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కోటేష్ రైతులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు ఉచిత కరెంటు అవసరం లేదని వ్యాఖ్యానించడంపై గురువారం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ అంజయ్యనాయక్, మల్లయ్యయాదవ్, రజాక్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

గోపాల్‌పేట: నోటికి అడ్డూ అదుపు లేకుండా మాట్లాడే వారికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని రేవల్లి ఎంపీపీ సేనాపతి, గోపాల్‌పేట ఎంపీపీ సంధ్య అన్నారు. రైతులకు కేవలం మూడు గంటల కరెంటు సరిపోతుందని చెప్పిన మాటలకు నిరసనగా రేవల్లి, గోపాల్‌పేట మండల కేంద్రాల్లోని సబ్‌స్టేషన్లలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, సర్పంచ్ వినీలారాణి, మండల అధ్యక్షుడు వెంకటస్వామి, గౌడ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: ఉచిత విద్యుత్ సరఫరాపై కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్యనాయుడు, రాముయాదవ్, రామ్మూర్తినాయుడు, సర్పంచ్‌లు బాలస్వామి యాదవ్, నాగేష్‌నాయుడు, విండో డైరెక్టర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అనుచిత వ్యాఖ్యాలు చేసిన రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్ ఎల్లారెడ్డి, గౌని బుచ్చారెడ్డి, రాజశేఖర్‌గౌడ్, బల్‌రాం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మాయమాటలు చెప్పి అధికారంలోకి రావడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రైతుల బతుకులు చీకటవుతాయని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్ అన్నారు. గురువారం మండలంలోని కానాయపల్లి సమీపంలోని సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుంత మౌనిక, గాడీల ప్రశాంత్, శ్రీనివాస్‌జీ, అల్లాబాష, వైస్ ఎంపీపీ వడ్డె శ్రీను, రవిందర్‌రెడ్డి, వినోద్‌సాగర్, రైతులు ఉన్నారు.

పెద్దమందడిలో..

పెద్దమందడి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. కార్యక్రమంలో నాగేంద్రంయాదవ్, పీఏసీఎస్ ఉపాధ్యక్షులు కుమార్‌యాదవ్, పల్లె సత్యనారాయణ, సేనాపతి, పురుషోత్తంరెడ్డి, రాధాకృష్ణ, లోకేష్, పుల్లన్న, కురుమూర్తి, రాంచంద్రయ్య తదితరులు ఉన్నారు.